# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 15-08-2025 | సంపుటి - 24 | సంచిక -100 | రూ : 4 | పేజీలు: 8









ప్రగతి పథం.. సకలజన హితం.. మన ప్రజా ప్రభుత్వం...

జారీ చేసిన వారు: సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం



# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 15-08-2025 | సంపుటి - 24 | సంచిక - 100 | రూ : 4 | పేజీలు: 8


## నేడు 12 జిల్లాల్లో అతి భారీ వర్షాలు



- ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ ఒడిశా దిశగా కదులుతున్న అల్పపీడనం
- నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో అత్యధికంగా 20 సెం.మీ వర్షపాతం

హైదరాబాద్, సూర్యాపేట: ఉత్తర తెలంగాణ జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడుతున్నట్లు ఐఎండీ గుర్తించింది. ఇది ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ ఒడిశా దిశగా కదులుతున్నట్లు తెలిపింది. దీనివల్ల ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కొన్నిచోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అంచనా. అల్పపీడనానికి తోడు ఉపరితల ఆవర్తనం, ద్రోణి కూడా ఏర్పడటంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. శుక్ర, శనివారాలకు సంబంధించి పలు జిల్లాలకు ఆరెంజ్ ఎలర్ట్‌ను జారీ చేసింది. శుక్రవారం 12 జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. అల్పపీడనం కారణంగా బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు రాష్ట్రవ్యాప్తంగా అతి భారీ వర్షాలు నమోదయ్యాయి. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో కుండపోతగా కురిసింది. ఇక్కడ 20 సెం.మీ నమోదైంది. వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం, వనపర్తి, నల్గొండ, మహబూబ్‌నగర్, ములుగు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. తరువాయి 3లో








3లో

## భారతదేశమే టార్గెట్..

- 'రాకెట్ ఫోర్స్' ఏర్పాటు చేసిన పాకిస్థాన్

- పాకిస్థాన్‌లో కొత్తగా రాకెట్ ఫోర్స్ ఏర్పాటుకు నిర్ణయం
- భారత్‌ను లక్ష్యంగా చేసుకునే ఈ దళాన్ని స్థాపిస్తున్నట్టు వెల్లడి
- అధికారికంగా ప్రకటించిన ప్రధాని షెహబాజ్ షరీఫ్
- సింధూ జలాల విషయంలో భారత్‌కు తీవ్ర హెచ్చరికలు
- పాక్ ఆర్మీ చీఫ్ నుంచి అణు యుద్ధ బెదిరింపు వ్యాఖ్యలు
- మోదీకి వ్యతిరేకంగా ఏకం కావాలని బిలావల్ భుట్టో పిలుపు



3లో

## క్రిప్టో మార్కెట్లో కొత్త సునామీ..

- రికార్డులు బద్దలు కొడుతున్న బిట్‌కాయిన్
- రికార్డు స్థాయిలో లక్షా 24 వేల డాలర్లను దాటిన బిట్‌కాయిన్
- ట్రంప్ ప్రభుత్వ క్రిప్టో అనుకూల విధానాలతో పెరిగిన జోష్
- ఈ ఏడాది ఇప్పటికే 32 శాతం పెరిగిన బిట్‌కాయిన్ విలువ
- ఈథర్, సోలానా వంటి ఇతర కాయిన్ల ధరలు కూడా పరుగులు

## ప్రవీణ్ కుమార్, ఇతర నేతలను వెంటనే విడుదల చేయాలి

- పోడు భూముల పట్టాల కోసం పోరాడుతున్న నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారన్న కేటీఆర్
- రేవంత్ ప్రభుత్వ గూండాగిరికి ఇది నిదర్శనమని మండిపాటు
- పోడు రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్

3లో






3లో

## 21 నుంచి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు

- 21 నుంచి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు

## పులివెందుల విజయంపై టీడీపీ నేతలంతా మాట్లాడాలి..

- రాష్ట్ర ప్రజలందరికీ తెలియాలి: చంద్రబాబు
- పులివెందులలో పరిస్థితులను ప్రజలు గమనించారన్న చంద్రబాబు
- 30 ఏళ్ల తర్వాత చరిత్రను తిరగరాశామని వ్యాఖ్య
- జగన్ అరాచకాల నుంచి ప్రజలు బయటపడుతున్నారన్న చంద్రబాబు





**అమరావతి :** పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికలో టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి 6,050 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించారు. వైసీపీ అభ్యర్థి హేమంత్ రెడ్డికి డిపాజిట్ కూడా దక్కకపోవడంతో టీడీపీ శ్రేణుల సంబరాలు తరువాయి 3లో

## స్వాతంత్ర్య దినోత్సవం 1090 మందికి కేంద్రం పతకాలు..

- శౌర్య పతకాల్లో జమ్మూకశ్మీర్ టాప్
- పోలీసు, ఫైర్, హోంగార్డు, కరెక్షనల్ సర్వీసెస్ సిబ్బందికి పురస్కారాలు
- శౌర్య పతకాల్లో అత్యధికంగా జమ్మూకశ్మీర్ సిబ్బందికి చోటు



3లో

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఇతర నేతలను వెంటనే విడుదల చేయాలి

**హైదరాబాద్:** బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సహా పలువురు ఇతర నేతలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పోడు భూముల పట్టాల కోసం పోరాడుతున్న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దిందా రైతులకు అండగా నిలిచినందుకు బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. రైతుల చేతికి సంకెళ్లు వేశారని, వారి కోసం పోరాడుతున్న వారిని అక్రమంగా అరెస్ట్ చేశారని... ఇది రేవంత్ ప్రభుత్వ గూండాగిరికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. పోడు రైతులను వేధించడం మాని, వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసుల అదుపులో ఉన్న ప్రవీణ్ కుమార్, ఇతర బీఆర్ఎస్ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పతనం దగ్గర్లోనే ఉందని అన్నారు.

# పులివెందుల విజయంపై టీడీపీ నేతలంతా మాట్లాడాలి..



(మొదటిపేజీ తరువాయి)

అంబరాన్ని అంటుతున్నాయి. ఈ ఘన విజయంపై టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు స్పందించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగాయి కాబట్టే పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో ఏకంగా 11 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని చంద్రబాబు అన్నారు. 30 ఏళ్ల తర్వాత ఓటు వేశామంటూ బ్యాలెట్ బాక్సుల్లో ఓటర్లు స్లిప్పులు పెట్టారని... పులివెందులలో పరిస్థితులు ఎలా ఉన్నాయనేది ప్రజలు గమనించారని చెప్పారు. ఈ విజయంపై టీడీపీ నేతలంతా మాట్లాడాలని సూచించారు. ప్రజలను చైతన్యం చేసే విధంగా నేతలు స్పందించాలని చెప్పారు. 30 ఏళ్ల తర్వాత చరిత్రను తిరగరాశామని అన్నారు. జగన్ అరాచకాల నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నారని చంద్రబాబు చెప్పారు. 30 ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు ధైర్యంగా ఓటు వేశారనే విషయాన్ని రాష్ట్ర ప్రజలందరికీ తెలియజేయాలని మంత్రులకు సూచించారు.

## భారతదేశమే టార్గెట్...

# 'రాకెట్ ఫోర్స్' ఏర్పాటు చేసిన పాకిస్థాన్

**ఢిల్లీ:** భారత్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ సైనిక సామర్థ్యాన్ని మరింత పెంచుకునే దిశగా, ప్రత్యేకంగా 'రాకెట్ ఫోర్స్'ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. బుధవారం రాత్రి ఇస్లామాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ నిర్ణయం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న ఉద్రిక్త వాతావరణాన్ని మరింత తీవ్రతరం చేసేలా ఉంది. అత్యాధునిక సాంకేతికతతో పనిచేసే ఈ దళానికి ప్రత్యేక కమాండ్ ఉంటుందని, యుద్ధ సమయాల్లో క్షిపణుల మోహరింపు, ప్రయోగాన్ని ఇది పర్యవేక్షిస్తుందని పాక్ సైనిక వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా భారత్‌ను దృష్టిలో ఉంచుకొనే ఈ దళాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఓ సైనికాధికారి ఒక ఆంగ్ల వార్తా సంస్థతో చెప్పడం గమనార్హం. గతంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' వంటి క్షిపణి దాడులను ఎదుర్కొనే వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రకటనకు కొద్ది గంటల ముందే, ప్రధాని షెహబాజ్ సింధూ నది జలాల విషయంలో భారత్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సింధూ నది పాకిస్థాన్‌కు జీవనాధారమని, దాని నుంచి ఒక్క చుక్క నీటిని మళ్లించినా భారత్ మరచిపోలేని గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. కేవలం ప్రధాని మాత్రమే కాకుండా, పాక్ సైన్యాధిపతి అసీం మునీర్, పీపీపీ నేత బిలావల్ భుట్టో సైతం భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో మాట్లాడుతూ, భారత్‌ను ఒక మెర్సిడెస్ కారుతో, పాకిస్థాన్‌ను ఒక డంప్ ట్రక్కుతో పోల్చిన మునీర్... రెండూ ఢీకొంటే నష్టం ఎవరికి ఎక్కువని ప్రశ్నించారు. సింధూ నదిపై భారత్ డ్యామ్ నిర్మిస్తే క్షిపణులతో పేల్చేస్తామని, తాము మునిగితే ప్రపంచంలో సగాన్ని తమతో పాటే తీసుకెళతామంటూ పరోక్షంగా అణు హెచ్చరికలు చేశారు. మరోవైపు, భారత ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా పాకిస్థాన్ ప్రజలందరూ ఏకం కావాలని బిలావల్ భుట్టో పిలుపునిచ్చారు. ఈ వరుస పరిణామాలు భారత్‌పాక్ సంబంధాలపై ఆందోళన కలిగిస్తున్నాయి.

# క్రిప్టో మార్కెట్లో కొత్త సునామీ..

**ఢిల్లీ:** క్రిప్టో కరెన్సీ మార్కెట్లో బిట్‌కాయిన్ కొత్త చరిత్ర సృష్టించింది. గురువారం ట్రేడింగ్‌లో దూసుకెళ్లి, ఏకంగా 1,24,210 డాలర్ల వద్ద ఆల్ టైమ్ హైని నమోదు చేసింది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం క్రిప్టోకు అనుకూలంగా తీసుకుంటున్న నిర్ణయాలు, ఫెడరల్ రిజర్వ్ త్వరలో వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న బలమైన అంచనాలు ఈ రికార్డు స్థాయి పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కన్నా తక్కువగా నమోదు కావడంతో, ఫెడరల్ రిజర్వ్ సెప్టెంబర్ 2025 నుంచే వడ్డీ రేట్ల కోతను ప్రారంభించవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. జులైలో వార్షిక ద్రవ్యోల్బణం 2.8 శాతంగా ఉంటుందని అంచనా వేయగా, అది 2.7 శాతానికే పరిమితమైంది. ఇది వడ్డీ రేట్ల తగ్గింపు వాదనలకు మరింత బలాన్నిచ్చింది. దీంతో ఇన్వెస్టర్లు క్రిప్టో మార్కెట్ వైపు భారీగా మొగ్గు చూపుతున్నారు. మరోవైపు, తనను తాను "క్రిప్టో ప్రెసిడెంట్"గా ప్రకటించుకున్న డొనాల్డ్ ట్రంప్, క్రిప్టో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. అంతేకాకుండా, స్టేబుల్ కాయిన్లపై కొత్త నిబంధనలు, డిజిటల్ ఆస్తులకు అనుగుణంగా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) నిబంధనలను సవరించడం వంటి చర్యలు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచాయి.

# స్వాతంత్ర్య దినోత్సవం... 1090 మందికి కేంద్రం పతకాలు..

**ఢిల్లీ :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి అందించే శౌర్య, సేవా పతకాల జాబితాను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటించింది. ఈ ఏడాది మొత్తం 1,090 మంది సిబ్బందిని ఈ పురస్కారాలకు ఎంపిక చేశారు. విధి నిర్వహణలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారికి అందించే శౌర్య పతకాలలో అత్యధికం జమ్మూకశ్మీర్ సిబ్బందికే దక్కడం విశేషం. ఈ ఏడాది ప్రకటించిన మొత్తం 1,090 పతకాలలో 233 శౌర్య పతకాలు, 99 రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 758 ప్రశంసనీయ సేవా పతకాలు ఉన్నాయి. దేశ శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించే పోలీసు శాఖకు అత్యధిక పతకాలు లభించాయి. పోలీసు విభాగంలో 226 మందికి శౌర్య పతకాలు, 89 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు,



635 మందికి ప్రశంసనీయ సేవా పతకాలు ప్రకటించారు. శౌర్య పతకాలు పొందిన వారిలో జమ్మూకశ్మీర్ తర్వాత సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బంది తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇతర విభాగాలైన ఫైర్ సర్వీసెస్‌లో 6 శౌర్య పతకాలు, 5 రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 51 ప్రశంసనీయ సేవా పతకాలు సహా మొత్తం 62 పురస్కారాలు ప్రకటించారు. హోంగార్డు, సివిల్ డిఫెన్స్ విభాగంలో ఒక శౌర్య పతకం, 3 రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 41 ప్రశంసనీయ సేవా పతకాలు ఉన్నాయి. కరెక్షనల్ సర్వీసెస్ (జైళ్ల శాఖ)లో ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 31 మందికి ప్రశంసనీయ సేవా పతకాలు అందించనున్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర సాయుధ బలగాలలో పనిచేస్తూ దేశ భద్రత, శాంతిభద్రతల కోసం విశేష కృషి చేసిన వారి సేవలకు గుర్తింపుగా ఏటా ప్రభుత్వం ఈ పతకాలను ప్రకటిస్తుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ పతకాలను సిబ్బందికి అందజేస్తారు.

# 21 నుంచి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లలో ఈ నెలాఖరులోగా లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా హౌసింగ్ శాఖ సన్నాహాలు చేస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండలపాడులో 21వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఇళ్ల ప్రారంభోత్సవాలకు ముహూర్తం ఖరారు చేసినట్లు సమాచారం. తర్వాత మిగిలిన చోట్ల స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు పూర్తయిన ఇళ్లను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు మొత్తం 44 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 4వేల ఇళ్ల పనులు చివరి దశకు చేరాయి. వీటిలో సాధ్యమైనన్ని ఇళ్లను నెలాఖరులోగా పూర్తి చేసి ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రేటర్ హైదరాబాద్ మినహాయించి మొత్తం 3.68 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 3.13 లక్షల ఇళ్లకు మంజూరు పత్రాలు జారీ చేయగా 1.96 లక్షలు గ్రౌండింగ్ అయ్యాయి. పునాది దశలో 85 వేలు, గోడ దశలో 10 వేలు ఉన్నాయి. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 98,969 (26.85 శాతం) ఇళ్లు పురోగతిలో ఉన్నాయి.

# నేడు 12 జిల్లాల్లో అతి భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

**కాలనీలు జలమయం**

సూర్యాపేట జిల్లాలో భారీవర్షంతో వరదలు ముంచెత్తి జనజీవనం స్తంభించింది. జిల్లాలో 6.62 సెం.మీ. వర్షపాతం నమోదవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, కుంటలు ఉప్పొంగాయి. అత్యధికంగా మేళ్లచెరువులో 12.60 సెం.మీ., ఆత్మకూరు(ఎస్) 11.01, పాలకవీడు 10.60, నడిగూడెం 10.13 సెం.మీ. చొప్పున వర్షం కురిసింది. కోదాడ పెద్దచెరువు అలుగుతో అనంతగిరి, కోదాడ ప్రధాన రహదారి మధ్య రాకపోకలు నిలిచాయి. కోదాడలో పలు కాలనీలు నీట మునిగాయి. మోతె మండలం ఉర్లుగొండ వద్ద పాలేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. హుజూర్‌నగర్, సూర్యాపేటలలో కొన్ని కాలనీల్లోకి వరద నీరు రావడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీపురం గ్రామంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తున్న ఇర్ప లక్ష్మి (60) అనే గిరిజన మహిళ వాగులో కొట్టుకుపోయి మృతి చెందారు. వికారాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాజెక్టులు నిండాయి. కొన్నిచోట్ల రహదారులు తెగిపోయాయి. పత్తి, కంది, మొక్కజొన్న, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది.

**బెంగళూరు హైవేపై వరద**

భూత్పూర్, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్



మండలం శేర్పల్లి (బి) గ్రామ సమీపంలో గురువారం 44వ జాతీయ రహదారి (బెంగళూరు హైవే)ని వరద ముంచెత్తింది. అక్కడ వంతెన నిర్మాణ పనులు జరుగుతుండటంతో కల్వర్టును మూసివేశారు. నీళ్లు వెళ్లేందుకు మరో మార్గం లేకపోవడంతో కిలోమీటరు మేర రహదారిపై కొన్ని గంటలసేపు వరద నీరు నిలిచిపోయింది.

**హిమాయత్‌సాగర్‌కు నీటి వెల్లువ**

బండ్లగూడ జాగీర్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని హిమాయత్‌సాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద ప్రవాహం భారీగా వచ్చి చేరుతోంది. ఇప్పటికే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో గత వారం రోజులుగా కొంతమేర వరదను దిగువన ఈసీ నదిలోకి వదులుతుండగా.. గురువారం ఏకంగా 10 గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి 13,450 క్యూసెక్కులు వదిలారు.

# స్వాతంత్ర్య వేడుకలకు గోల్కొండ ముస్తాబు

* జెండా ఎగరేయనున్న ముఖ్యమంత్రి

గోల్కొండ: చారిత్రక గోల్కొండ కోటలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తారామతి మసీదు వద్ద ముఖ్యమంత్రి జెండా ఎగురవేసే వేదికను అలంకరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు వేడుకలు తిలకించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వర్షమొస్తే ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక షెడ్లు వేశారు. శుక్రవారం ఉదయం 9.55 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి కోట ప్రధాన ద్వారం వద్దకు చేరుకుంటారు. అక్కడే పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాణీమహల్ వద్ద ఉన్న వేదికకు చేరుకుని ఉదయం 10 గంటలకు జెండా ఎగురవేసి రాష్ట్ర ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన 25 మందికి పతకాలు ప్రదానం చేయనున్నారు. గురువారం సౌత్‌వెస్ట్‌జోన్ డీసీపీ చంద్రమోహన్, ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌లు కోటలో బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**దేశాభివృద్ధికి కట్టుబడి ఉందాం: గవర్నర్**

హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. "మన వీరుల త్యాగాల ఫలితాలను ఈ రోజు మనం అనుభవిస్తున్నాం. వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ.. భారతదేశ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందాం. ప్రకాశవంతమైన రేపటి వైపు కలిసి నడుద్దాం" అని గవర్నర్ పేర్కొన్నారు.



**కేసీఆర్ శుభాకాంక్షలు**

రాష్ట్ర ప్రజలకు భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. "స్వాతంత్ర్య సమరాన్ని నిరాయుధ శాంతియుత పద్ధతిలో నడిపించిన మహాత్మాగాంధీ పోరాట స్ఫూర్తే.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది" అని కేసీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.



**రాష్ట్రపండుగగా సర్వాయి పాపన్న జయంతి**

సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఈ నెల 18న రాష్ట్రపండుగగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాలమాయాదేవి తెలిపారు. యువత సేవాభావంతో ముందుకు సాగాలి: రాష్ట్రపతి

కల్వకుర్తి, న్యూస్‌టుడే: దేశ సేవలో యువత సేవాభావంతో ముందుకు సాగాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. గురువారం దిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో వివిధ రాష్ట్రాల నుంచి జాతీయ యువజన పురస్కారాలందుకున్న శివకుమార్, బిసాతిభరత్, రోహిత్, మదీష్, జాతీయ సేవా పురస్కార గ్రహీతలు మంటుకుమార్, శ్రీష్టి, నిహారిక, సీమరీప్ రాష్ట్రపతిని కలిశారు. సంవిధాన్ సపోర్టర్స్ గ్రూప్ తరపున యువజన అవార్డుగ్రహీతలంతా ఒక దేశంఒకే ఎన్నికపై ప్రచారం చేయడం అభినందనీయమని రాష్ట్రపతి ముర్ము అన్నారు.

# వరద ప్రాంతాలకు అధికారులను పంపాలి

* కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో సీనియర్ అధికారులను వరద ప్రభావిత ప్రాంతాలకు పంపించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదేశాలతో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించామన్నారు. అవి స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి పనిచేస్తున్నాయన్నారు. భాజపా కార్యకర్తలు కూడా సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మరో రెండు రోజులు భారీ వర్షసూచనలున్న నేపథ్యంలో నదులు, వాగులున్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# యూరియా కొరతపై దర్యాప్తు చేయించాలి

* భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



హైదరాబాద్: రాష్ట్రంలో యూరియా కొరతపై దర్యాప్తు చేయించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్‌లో తిరంగా యాత్ర సందర్భంగా రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సరిపడా యూరియా సరఫరా చేస్తున్నప్పటికీ రాష్ట్రంలో కొరతకు కారణాలేంటో ప్రభుత్వం ఆరా తీయాలన్నారు. దళారుల కారణంగానే యూరియా కొరత ఏర్పడుతున్నట్టు కనిపిస్తోందని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆపరేషన్ సింధూర్ జాతి విజయం

* **జాతి సమైక్యతకు ప్రతీకగా ప్రతీ ఒక్కరం...**
* **బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఆపరేషన్ సింధూర్ జాతి విజయమని బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మంగళగడ్డ హనుమాన్ దేవస్థానం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మన త్రివర్ణ పతాక వైభవాన్ని చాటడంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు మన సైనికుల వీరత్వానికి ప్రతీకగా నిలిచిన ఆపరేషన్ సింధూర్ విజయం పట్ల గర్వంతో ఆపరేషన్ సింధూర్ విజయానికి చిహ్నంగా మన దేశ సైనికుల పరాక్రమంపై గర్వంతో జాతి సమైక్యతకు ప్రతీకగా ప్రతీ ఒక్కరం మన ఇళ్ళపై జాతీయ పతాకాన్ని ఎగురవేద్దామని, దేశభక్తిని చాటుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగ మండల కన్వీనర్ (మండల ప్రధానకార్యదర్శి) ఎదునూరి గోపికృష్ణ, బుచ్చేల్లి మహేశ్వరీ, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజగౌడ్, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, చిట్టీనేని శ్రీనివాస్ రావు, జిల్లెల్ల మల్లేశం, కోల



కృష్ణ, గుండవేణి తిరుపతి, కార్తీక్ రెడ్డి, మీస శంకర్, కళ్యాణ్, దీటి సత్యం, పప్పుల శ్రీకాంత్, కమిటీకారి పద్మ, ఆగ్రారం శేఖర్, చిగురు వెంకన్న, పున్నం అనిల్, సూతారీ దేవయ్య, దాసోజు శ్రీనివాస్, మాదాసు భూమయ్య, భగత్, గంధం వంశీ, పిరాళ్ల విజయ్, మ్యాకల లింగం, నర్ర ప్రశాంత్ రెడ్డి, రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ చంద్రారెడ్డి, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జి తదితరులున్నారు.

## రోజు ఒక పాఠశాల

**- ఎంఈఓ డాక్టర్ ప్రభు దయాల్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభు దయాల్ రోజు ఒక పాఠశాల కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతి ఉదయం తన పాఠశాల అయిన రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు ప్రారంభించిన అనంతరం, ప్రతిరోజు క్రమంగా ఒక ప్రాథమిక పాఠశాలను సందర్శిస్తున్నారు. ఈ పర్యటనల్లో విద్యార్థుల సామర్థ్యాలు, పాఠశాల నిర్వహణ, విద్యాభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తూ, అవసరమైన సూచనలు ఇస్తున్నారు. అనంతరం మండల విద్యా కార్యాలయంలో హాజరై పెండింగ్ పనులు లేకుండా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గురువారం ఆయన న్యూ గొల్లగూడెం పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యాసాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి భుజించి, పాఠశాల నిర్వహణను సమీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభు దయాల్ మాట్లాడుతూ, "పాఠశాల విద్యలో విద్యార్థులే ప్రధాన కేంద్రం. వారి అభివృద్ధికై ఉపాధ్యాయులు, నిర్వాహకులు కృషి చేయాలి" అని తెలిపారు. ప్రమాదాలను నివారించడానికి అధికారులు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విజ్ఞప్తి చేశారు.

## ఆలరించిన చిన్నారి కృష్ణులు

* **ముందస్తుగా ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో మహర్షి విద్యాలయంలో చిన్నారి కృష్ణులు, గోపికలు ఆలరించారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో ముందస్తుగా గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుని, గోపికల వేషాదారణలతో అందరిని ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమం మండల అధ్యక్షులు మెరుగు అంజా గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆరుట్ల మహేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు దాకూరి నాగరాజు, కోశాధికారి కాల్వ బాలాజి, గోపిశెట్టి సంతోష్, సలహాదారులు గందె రమేష్, కోయ రాము తదితరులున్నారు.

## వైభవంగా మంత్రి దామోదర్ సోదరుని కూతురు వివాహం...

* **హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు..**



అందోలు, .ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి సీ. దామోదర రాజనర్సింహ సోదరుని కూతురు శ్రీజ వివాహం గురువారం హైదరాబాదులో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకకు మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జానారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల తో పాటు రాష్ట్ర నాయకులతో పాటు నియోజకవర్గానికి చెందిన రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మరో రెండు రోజులు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా నదులు, వాగులు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉంది. రోడ్లపైకి నీరు చేరే పరిస్థితులు ఏర్పడవచ్చు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, బయటకు రావాల్సి వస్తే అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సెల్ఫీలు తీసుకోవడానికి పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లి ప్రమాదాలకు లోనుకావద్దని ఆయన హెచ్చరించారు. విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలు తక్షణమే జిల్లా కలెక్టరేట్ లో లేదా ఆర్డీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లకు, లేదా తమ మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు కాల్ చేసి సమాచారం అందించి సహాయం పొందవచ్చని




కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, అన్ని మండల అధికారులు అప్రమత్తంగా ఉండి, వర్షాల కారణంగా ఏర్పడే పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో సంబంధిత రెవెన్యూ, పోలీసు, రోడ్లు, మున్సిపల్, పంచాయతీ శాఖలతో సమన్వయం చేసుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో సిద్దేశ్వరుని ఆలయములో పూజలు...

అందోలు, ప్రజాస్ఫూర్తి: శ్రావణమాసం సందర్భంగా అందోల్ మండల పరిధిలోని కన్సన్ పల్లి గ్రామంలో సిద్దేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ శేరి జ్యోతి మాణిక్ రెడ్డి దంపతుల చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా పండితులు ఆనంద్ శర్మ పూజా కార్యక్రమాలలో భాగంగా గణపతి పూజ, కుంకుమార్చన, వంటి కార్యక్రమాలతో పాటు వేద మంత్ర మంత్రోచ్చరణల పంచామృతాలతో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. మహాశివుని కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండి అందరూ సుఖ సంతోషాలతో ఉండి, పాడి పంటలతో రైతులు అంతా సంతోషంగా ఉండలని ఆ దేవుడిని ఆకాంక్షించారు. పూజా కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు చిలుకంటి వెంకటేశం, మన్నె యాద గౌడ్,



మాజీ ఉపసర్పంచ్ మొరబోయిన కృష్ణ, మాజీ ఎంపిటిసి బాలయ్య, మాజీ వార్డు సభ్యులు గజేందర్ రెడ్డి, కురుమ సంఘం మండల నాయకులు సంగమేశ్వర్, కాంగ్రెస్ యువ నాయకులు రమేష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు మాధవరెడ్డి, శంకర్ రెడ్డి, బీజేపీ నాయకులు కాల్వమీది రమేష్, కాడెం గోపాల్, వివోఏ ఆంజనేయులు తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## కొత్తగూడెం ఏరియా జిఎం కార్యాలయం వద్ద ఐఎన్టీయూసీ ధర్నా

* **కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం డిమాండ్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర సెక్రటరీ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆధ్వర్యంలో జిఎం కార్యాలయం ఎదుట ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ, సింగరేణి సొంత ఇల్లు కల, మెడికల్ బోర్డులో మార్పులు, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం వంటి అనేక సమస్యలు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ సమస్యలపై అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం దురదృష్టకరమని, నిరంకుశ వైఖరికి నిరసనగా ఈ ధర్నా చేపట్టినట్లు చెప్పారు. ధర్నాలో సింగరేణి కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మిక నాయకులు జెట్టి మోహన్, మాద శ్రీనివాస్, వాసపల్లి వినయ్, దుర్గ కుమార్, మల్లికార్జున్, గంగారం, పురుషోత్తం, మోహన్, నాగయ్య, విద్యాసాగర్, సారయ్య, స్వామి సాయి, శ్రీను, ప్రశాంత్, ఐలయ్య, పరమేష్, బాలయ్య, రమేష్, నిరంజన్, సురేష్, వినోద్, బాబురావు, ముల్స్ రాహుల్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇల్లందులో ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇల్లందు పట్టణంలో గురువారం బిజెపి పట్టణ మహిళా అధ్యక్షురాలు సుచిత్ర పాసి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో కలిసి త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకొని పట్టణంలోని వీధి వీధి తిరుగుతూ భారతీయ మువ్వన్నెల జెండా గొప్పతనం అందరికీ తెలిసేలా దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ మహిళా అధ్యక్షురాలు సుచిత్ర పాసి మాట్లాడుతూ భారత జాతీయ పతాకాన్ని ప్రతి భారతీయుడు ఇంటిపై ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రేవల్ల నాగరాజు, శాసనల రామయ్య



, మిర్యాల వెంకన్న, రాజకుమార్ పాసి, నరసింహారెడ్డి, కీర్తి ప్రసాద్, దండ రామచందర్, బోడపాటి శ్రీనివాస్, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ధ్యాన కేంద్రంలో మొక్కలు నాటిన జిఎం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లందులోని హార్ట్ ఫుల్ నెస్ రామచంద్ర మిషన్ సింగరేణి సంస్థ ఏరియా జిఎం వీసం కృష్ణయ్య మొక్కలు నాటారు. రామచంద్ర మిషన్ సింగరేణి సంస్థల అవగాహన ఒప్పందంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జి ఎం మాట్లాడితే వెల్లడించారు. గురువారం ఆయన సతీమణి, సింగరేణి సేవా కేంద్రం అధ్యక్షురాలు, లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు రమ తో కలిసి ఆశ్రమంలో మొక్కలు నాటే కార్యక్రమం లో పాల్గొన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరంగం రామలింగేశ్వర రావు, సింగరేణి ఉద్యోగులు, రామచంద్ర మిషన్ అభ్యసిలు పాల్గొన్నారు. తొలుత, మిషన్ అభ్యాసి మాధురి జ్ఞాన కార్యక్రమాన్ని నిర్వహించి, ధ్యానం వలన పొందే ఉపయోగాలను వివరించారు. అభ్యసిలు కళాశాల బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొనీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జిల్లా యంత్రాంగం సూచనలను పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

* **ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే రెండు రోజుల్లో జిల్లాకు భారీ వర్షసూచన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం సూచనలను పాటిస్తూ ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనను విడుదల చేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని సూచించారు. వరద నీటితో ప్రమాదకరంగా మారిన రోడ్లను దాటడానికి ప్రయత్నం చేయొద్దని సూచించారు. ఉదృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, నదులు, చెరువుల వద్దకు చూడటానికి వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని తెలిపారు. ఇతర శాఖల అధికారుల సమన్వయంతో జిల్లా పోలీసు శాఖ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. భారీ వర్షాల కారణంగా అకస్మాత్తుగా వాగులు , నదులలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికైనా విపత్కర పరిస్థితి ఎదురైతే వెంటనే డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీసు వారి సేవలను పొందాలని తెలియజేసారు. చంద్రుగొండ పరిధిలోని సీతాయిగూడెం నుండి తిప్పనపల్లి వైపు ఉదృతంగా ప్రవహిస్తున్న ఎదుళ్ల వాగును ఈ రోజు ఎస్పీ సందర్శించడం జరిగింది.

## భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ గా చల్లా ప్రభాకర్..



ప్రజాస్ఫూర్తి, కాప్రా : భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ గా చల్లా ప్రభాకర్ ను నియమించారు. గురువారం హబ్సిగూడ సుప్రభాత్ హోటల్ లో జరిగిన మల్కాజ్గిరి పార్లమెంట్ స్థాయి గణేష్ ఉత్సవ సమితి సమావేశంలో పార్లమెంట్ ఇన్చార్జి నాయని బుచ్చిరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చల్లా ప్రభాకర్ మాట్లాడుతూ.. మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందజేసే విధంగా పనిచేసి హిందుత్వ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని తెలియజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పజెప్పిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. తనకు బాధ్యత రావడానికి సహకరించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్, కార్యదర్శి రమేష్ బాబు, ఓ బి సి మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, కేంద్ర కమిటీ సభ్యులు రేవల్లి రాజులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, ఉడుత నవీన్, ఫణిందర్, గౌనె శ్రీకాంత్, రవీందర్ గౌడ్, రూత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్టియూ మహాధర్నాను విజయవంతం చేయాలి..

**- పీఆర్టియూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య**

అందోలు, ప్రజాస్ఫూర్తి: సిపిఎస్ రద్దుకై శాసన మండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి పిలుపు మేరకు పిఆర్టియుటిఎస్ రాష్ట్ర సంఘ నేతృత్వంలో సెప్టెంబర్ 01న ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టియూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య అన్నారు. గురువారం మహాధర్నా పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకై సంఘ పక్షాన మహాధర్నా కు పిలుపునివ్వడం సమస్య పట్ల సంఘానికి ఉన్న నిబద్ధత తెలుపుతూ ఉందని, మహాధర్నా విజయవంతం చేయడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షన్ హక్కును కాలరాస్తూ... 2004 సంవత్సరంలో ప్రవేశపెట్టిన కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమును రద్దు చేయాలని పిఆర్టియు ఆధ్వర్యంలో అనేక సందర్భాలలో ధర్నా కార్యక్రమాలు నిర్వహించటం, ఆందోళనలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ నేటి వరకు సిపిఎస్ రద్దు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రూపం మారుస్తూ యుపిఎస్ అనే కొత్త పెన్షన్ స్కీం పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఫలితంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు వృద్ధాప్యంలో పొందవలసిన పెన్షన్ దూరం చేశారన్నారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ పిఆర్టియు ఆధ్వర్యంలో భారీ నిరసన "మహా ధర్నా" కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు సంఘీభావంగా




ఓపిఎస్ ఉపాధ్యాయులు కూడ ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె.సురేందర్, సీఎన్జీవో నాయకులు శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, యండి.మౌలానా, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, జిల్లా బాధ్యులు బి.శ్రీనివాస్, పిఆర్టియు సంగారెడ్డి (రూరల్), కంది, కొండాపూర్, కోహిర్, ఝరాసంగం, రాయికోడ్, జహీరాబాద్ (రూరల్), పుల్ కల్, చౌటకూర్, హత్నూర మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్, సి.హెచ్.రాజు, యం.శ్రీనివాస్, పి.దామోదర్, సురేష్, శ్రీధర్ నాథ్, పి.రమాకాంత్, వేణుగోపాల్, ప్రశాంత్, శ్రీశైలం, లక్ష్మీనారాయణ, ప్రహ్లాద్, శాతం రాములు, వెంకటస్వామి, పద్మనాభం, సభ్యులు సవితాబాయి, సుమన గారలు, తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల టిడిపి విజయం పై హర్షం వ్యక్తం చేసిన

*** ఇల్లందు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ**



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పులివెందుల ఒంటిమిట్టలో జరిగిన జడ్పిటిసి ఎన్నికల్లో తెదేపా అభ్యర్థులు ఘనవిజయం సాధించడం పట్ల పట్టణంలోని తెదేపా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ మాట్లాడుతూ ఏపీ కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. 30 సంవత్సరాల నుండి ఎన్నికలు జరగకుండా అడ్డుకున్న జగన్మోహన్ రెడ్డి అరాచకానికి నేడు కూటమి ప్రభుత్వం సంకెళ్ళు తీసిందన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మంత్రి నారా లోకేష్ సారధ్యంలో రానున్న ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయాలను సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రమేష్ బాబు, తెదేపా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పాలముల బాలకృష్ణ, దేశావత్ శ్రీహరి, సీనియర్ నాయకులు కారు నరసన్న, మైప బాలరాజు, అయ్యోరి నాగరాజు, కంది రవి, దగ్గుల లింగయ్య, దాసరి గోపాలకృష్ణ, నవీన్, రాజేష్, శ్రీవేద్, వినీత్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధి జీడిమెట్ల గ్రామంలో హర్ గర్ తిరంగా అబ్యాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన హర్ గర్ తిరంగా ర్యాలీలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ , బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చేరుకుపల్లి భరత్ సింహ రెడ్డి లు పాల్గొని ప్రతి ఇంటికి త్రివర్ణ పతాకం అందజేశారు. ఈ కార్యక్రమం డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు,నార్లకంటి దుర్గయ్య, నార్లకాంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ,పెద్దింటి సాయిలు,గంగాధర్,చక్రి,మాహేష్,ప్రసాద్ శర్మ,రమేష్ సతీష్,అరవింద్,యశ్వంత్, పాపయ్య,సాయి, వీరేశం, అంజయ్య, వెంకీ, రవీందర్,శ్యామ్, శ్రీకాంత్,క్రాంతి తదితరులు పాల్గొన్నారు



## స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ప్రగతి మైదానంలో శుక్రవారం జరగబోయే 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. జాతీయ పతాక ఆవిష్కరణ నుండి కార్యక్రమం ముగిసే వరకు జరిగే అన్ని ఏర్పాట్లను సమగ్రంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హరాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ , చేనేత శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉదయం 9:30 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని ఇస్తారు. ఈ కార్యక్రమంలో మార్చ్ పాస్ట్, స్వాతంత్ర్య సమరయోధుల సన్మానం, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. వేదిక బ్యాక్డ్రాప్, పోలీసు సాయుధ దళాల మార్చ్ పాస్ట్, స్వాతంత్ర్య సమరయోధుల సన్మానం వంటి కార్యక్రమాల నిర్వహణ పగడ్బందీగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా, డి.ఆర్.డి.ఏ., డ్వామా, వ్యవసాయం, సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, గిరిజన సంక్షేమం, వైద్య ఆరోగ్యం, ఉద్యానవనం, సూక్ష్మ సేద్యం, తదితర శాఖలు ఏర్పాటు చేసే స్టాల్స్ ఆకర్షణీయంగా ప్రజలను ఆకట్టుకునేలా ఉండాలని ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటు చేసే ఛాయాచిత్ర ప్రదర్శనలు, అధికారులకు , విఐపీలకు గ్యాలరీలు, మంచినీటి వసతి, వాహన పార్కింగ్ వంటి సదుపాయాలు పకడ్బందీగా ఉండాలని, వర్షం వచ్చినా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దార్ పుల్లయ్య , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నివేదిత మావోయిస్టు పార్టీకి చెందిన
## 6 మంది దళసభ్యులు ఎస్పీ ఎదుట లొంగుబాటు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 81 మరియు 141 సిఆర్పిఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసి ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న "ఆపరేషన్ చేయూత" కార్యక్రమం ఫలితంగా, నిషేధిత మావోయిస్టు పార్టీలో పనిచేసిన 6 మంది దళసభ్యులు (వారిలో ముగ్గురు మహిళలు) గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎదుట లొంగిపోయారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ అందిస్తున్న పునరావాస సౌకర్యాలు, సాయాలు గురించి తెలుసుకున్న వీరు, నక్సలిజాన్ని విడిచిపెట్టి కుటుంబాలతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకున్నారు.ఈ సంవత్సరం (జనవరి 2025 నుండి) ఇప్పటివరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే 306 మంది మావోయిస్టు సభ్యులు జనజీవన స్రవంతిలో కలసి పునరావాస సౌకర్యాలను పొందారు. మావోయిస్టు పార్టీ క్షీణదశలో ఉండటంతో, క్రింది స్థాయి సభ్యులు పై స్థాయి నాయకత్వ ఆదేశాలను వ్యతిరేకిస్తూ, రహస్య ఉద్యమ జీవితం నుండి బయటకు వస్తున్నారు. అడవుల్లో ఆదివాసి గ్రామాల ప్రజలు సహకరించకపోవడంతో, ఆహార లోపం, ఆరోగ్య సమస్యలు మరింత పెరిగాయి. 90 శాతం పైగా సభ్యులు పేద కుటుంబాలకు చెందినవారే కావడంతో, కుటుంబ అభివృద్ధి కోసం పార్టీని విడిచి శాంతియుత జీవితం వైపు అడుగులు వేస్తున్నారు. గురువారం లొంగిపోయిన 6 మంది సభ్యులకు తక్షణ



సహాయంగా ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున, మొత్తం రూ.1,50,000 నగదు అందజేశారు. మిగతా పునరావాస సాయం వారి ర్యాంకుల ఆధారంగా, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు పూర్తి అయిన తరువాత చెక్కుల రూపంలో జమ చేయబడుతుంది. ప్రభుత్వం ఆదివాసుల అభివృద్ధి పట్ల సానుకూలంగా స్పందిస్తున్నదని, అలాగే కర్రగుట్టలలోని అటవీ సంపదను రక్షించడానికి అవసరమైన పోలీసు, కేంద్ర బలగాల క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.ఆదివాసి ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి నమ్మకంలో కానీ, భయంలో కానీ మావోయిస్టు పార్టీకి సహకరించడం వలన ప్రాంతాలు అభివృద్ధి చెందవు. ప్రజాస్వామ్య ప్రభుత్వాల ద్వారా మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యం. "అభివృద్ధిలో కూడిన ప్రజల శాంతియుత జీవనం" మా పోలీసుల నినాదమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## ప్రకృతి ప్రేమికుడు సింగరేణియన్ కేఎన్ రాజశేఖర్‌కు రాష్ట్ర గవర్నర్ ఆహ్వానం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిరోజు ఒక మొక్క నాటే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి, 114వ మన్ కీ బాత్ లో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేత ప్రశంసలు అందుకున్న సింగరేణి సెంట్రల్ వర్క్‌షాప్‌కు చెందిన ప్రకృతి ప్రేమికుడు కేఎన్ రాజశేఖర్ మొక్కల రాజశేఖర్ కి మరో గౌరవం దక్కింది. ఆగస్టు 15న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అందించే తేనీటి విందుకు అతిథిగా హాజరు కావాలని రాజశేఖర్‌కు ఆహ్వాన పత్రిక పంపించారు.ఈ సందర్భంగా సింగరేణి సెంట్రల్ వర్క్షాప్ జీఎం దామోదర్, డిప్యూటీ ఇంజనీర్ రాజీవ్ కుమార్, ఆకునూరి కనకరాజు, గౌస్ బాయ్, శంకర్ (ఆల్ ఇండియా రేడియో, కొత్తగూడెం), రామకృష్ణ, సంగం వెంకట పుల్లయ్య, షేక్ దస్తగిరి, తూముల శ్రీనివాస్, ఆకునూరు సుప్రియ, మహమ్మద్ ముస్తఫా, జి. సుగుణారావు, కమలా రాణి, దశరథ్ రజువా, గుండపనేని సతీష్, లగడపాటి రమేష్ చంద్, రక్తదాత కన్నా, యంగ్ ఇండియా బాలు, ఇంగ్లీష్ మీడియా బాలు, జాకీర్ హుస్సేన్ తదితరులు రాజశేఖర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ "నా సేవలను గుర్తించి రాష్ట్ర గవర్నర్ ఆహ్వానం అందుకోవడం నాకు ఎంతో ఆనందం కలిగించింది. పర్యావరణ పరిరక్షణ కోసం మరింత కృషి చేస్తాను" అన్నారు.

## నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడేది లేదు

*** ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటపాపయ్య నగర్ లో సీసీ రోడ్డు నిర్మాణం పెండింగులో ఉందని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా గురువారం కార్పొరేటర్ కాలనీ లో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణం కొరకు సాంక్షన్ లో పెట్టడం జరిగిందన్నారు. నిధులు మంజూరైన వెంటనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షులు జనార్ధన్ రావు, పోశెట్టిగౌడ్, రమేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తి విశ్వమానవతకు విరుద్ధమా? : గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్

బెంగళూరు: ఒక చెట్టును చూసినపుడు, దాని వేర్లు కనబడవు. ఆ వేర్లకు గౌరవం ఇవ్వకపోతే చెట్టు బతకదు. వేర్లు పరిపుష్టంగా ఉన్నప్పుడే చెట్టుకు స్థిరత్వం. ఒక దేశ చరిత్ర, సంప్రదాయాలు దాని వేర్లవంటివి. మనం మన మూలాలకు, వేర్లకు గౌరవం ఇవ్వాలి, వర్తమానంలో జీవించాలి, భవిష్యత్తుపై సానుకూల దృష్టి కలిగి ఉండాలి. అయితే, దేశభక్తి, గతవైభవాన్ని గురించి గర్వపడటం.. ఇవి విశ్వమానవత విలువలకు విరుద్ధం కావు. ప్రపంచమంతా కుగ్రామంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో మీరు ప్రపంచ పౌరుడిగా ఉండాలనడంలో సందేహం లేదు. కానీ, అలా ఉన్నంతమాత్రాన దేశభక్తి ఉండకూడదనేది సరైన అభిప్రాయం కాదు. మీ దేశభక్తితో ఇతర దేశాలను తక్కువ చేయాల్సిన అవసరం లేదు. కొన్ని దేశాలు తమ ప్రజల్లో దేశభక్తిని ప్రోత్సహిస్తూనే, ఇతర దేశాల దేశభక్తిపై అసహనం చూపుతాయి. ఇదీ మంచిది కాదు. ప్రతీ దేశ ప్రజలూ దేశభక్తిని అనుభూతి చెందాలి. తమ మాతృభాషలపై అభిమానం కలిగి ఉండాలి. ఉదాహరణకు కన్నడిగులకు కన్నడం మాతృభాష. దానిపట్ల వారు గర్వపడాలి. అలాగే, ఫ్రెంచ్ వ్యక్తి, రష్యన్ వ్యక్తి, అందరూ తమ తమ భాషల పట్ల గర్వపడాలి. భారతదేశంలోని ప్రతి రాష్ట్రానికీ ప్రత్యేకమైన సంస్కృతి, స్వతంత్రత ఉంటాయి. వాటికి ప్రత్యేకమైన ఆహారం, సంగీతం, జానపద సంస్కృతి ఉన్నాయి. ఈ వారసత్వాన్ని కాపాడుకోవడం, పోగొట్టుకోకుండా చూడటం ఎంతో అవసరం. దేశభక్తి, విశ్వమానవత ఇవి విరుద్ధ భావాలేం కాదు. అయితే, మనం దేశభక్తికి ఎలా విలువనిస్తాం, విశ్వమానవతకు ఎలా తోడ్పడతామనేదే తేడా. ఉదా: ఆధ్యాత్మికత అందరికీ చెందింది. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రపంచానికి పంచొచ్చు. అది ఎక్కడి నుంచి వచ్చినా.. మనం స్వాగతించాలి. "ఇది భారతదేశంలో పుట్టింది గనక నేను ఆచరించను"



అని లేదా 'టెలీఫోన్ అమెరికాలో కనిపెట్టారు గనక నా దేశంలో అనుమతించను'' 'సెల్ ఫోన్ ఫిన్‌లాండ్‌లో పుట్టింది గనక నేను వాడను'' అని చెప్పకూడదు. ఈ టెక్నాలజీ యుగంలో అది ఎక్కడ పుట్టిందన్నది పక్కన బెట్టి.. మనం అందరమూ దాన్ని షేర్ చేసుకుంటాం. సర్ ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ సూత్రాన్ని కనుగొన్నారు. ఆ సూత్రం అంతకు ముందునుంచే ఉంది. కానీ దాన్ని ఆయన కనుగొన్నారు గనక ఆ ఘనత న్యూటన్‌కు దక్కింది. దాన్ని ప్రపంచమూ అంగీకరించింది. అలాగే, భారతదేశం యోగా, ఆయుర్వేదాలను ప్రపంచానికి అందించింది. అన్ని దేశాలూ దీన్ని విశాల హృదయంతో గుర్తించాలి. ప్రాచీన భారత ఋషులు యోగా, ఆయుర్వేదాన్ని కనుగొన్నారు. వీరినే ఈ జ్ఞానశాఖల అసలు సృష్టికర్తలుగా గుర్తించాలి. విశ్వమానవత అనేది వైవిధ్యాన్ని నిరాకరించడం కాదు. పిల్లలను తమ మాతృభాష నేర్చుకునేలా ప్రోత్సహించాలి. ముఖ్యంగా తమ మాతృభాషలో లెక్కపెట్టడం నేర్చుకోవాలి. భారతదేశంలోని ప్రతి రాష్ట్రంలో స్థానిక భాషల్లో ఉన్న పాటలు, లోతైన తత్వాలతో కూడిన పద్యాలు చాలా ఉన్నాయి. ఇలాగే ప్రపంచంలోని ప్రతి ప్రాంతంలోనూ ఉంటాయి. ప్రాంతీయ వంటకాల వైవిధ్యాన్ని నిలబెట్టుకోవాలి. ఉదా: నేను 70వ దశకంలో కాలేజీలో ఉన్నప్పుడు కేరళకు వెళ్లాను. అప్పట్లో కేవలం సంప్రదాయ ఆహారమే దొరికేది. అందరూ ఆనందంగా ఆ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినేవారు. కానీ నేడు, ఆ వైవిధ్యం కనిపించడం లేదు. కాలక్రమేణా మనం ఆయుర్వేద జ్ఞానంలో చాలా భాగాన్ని మరిచిపోయాం. ఈ సంప్రదాయ పద్ధతులను పునరుద్ధరించి తిరిగి ఆచరణలోకి తీసుకురావాలి. ప్రత్యేకమైన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలి. తమ రాష్ట్రంలో, దేశంలో ఉన్న వాటిపై ప్రజలు గర్వించాలి. అదే సమయంలో తమ సంస్కృతిలోని మంచి పద్ధతులను ఎటువంటి పక్షపాతమూ లేకుండా ప్రపంచానికి పంచాలి. అలాగే, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్తమ పద్ధతులను మనసారా స్వీకరించాలి. దేశం పట్ల గౌరవం, ప్రపంచంతో స్నేహం.. ఈ రెండు కలిసి నడవాలి. ఇవి విరుద్ధ భావాలు కాదు'' అని గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ అన్నారు.

# భారత్‌పై ట్రంప్ ఆగ్రహం.. 50 శాతం సుంకాల వెనుక అసలు కారణం ఇదీ

* భారత వస్తువులపై 50 శాతం మేర టారిఫ్‌లు విధించిన ట్రంప్
* పాక్‌తో ఉద్రిక్తతల తగ్గుదలలో తన పాత్రను భారత్ గుర్తించలేదని ఆగ్రహం
* 'ఆపరేషన్ సింధూర్' కాల్పుల విరమణలో మధ్యవర్తిత్వాన్ని భారత్ తిరస్కరించడం
* బ్రిక్స్ కూటమిలో భారత్ సభ్యత్వంపై కూడా ట్రంప్ అసంతృప్తి
* ట్రేడ్ చర్చల్లో అమెరికా ఒత్తిళ్లకు భారత్ తలొగ్గలేదని వెల్లడి



**ఢిల్లీ :** భారత ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా 50 శాతం మేర భారీ సుంకాలు విధించడం వెనుక బలమైన కారణాలున్నాయని ప్రముఖ రచయిత, మాజీ దౌత్యవేత్త వికాస్ స్వరూప్ తెలిపారు. అందులో ప్రధానమైనది 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు తగ్గించడంలో తన పాత్రను భారత్ గుర్తించకపోవడమేనని ఆయన సంచలన విశ్లేషణ చేశారు. వాణిజ్యపరమైన ఒత్తిళ్లతో పాటు, ట్రంప్ వ్యక్తిగత అసంతృప్తి కూడా ఈ కఠిన నిర్ణయానికి దారితీసిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వికాస్ స్వరూప్ ఈ విషయాలను వెల్లడించారు. "భారత్‌పై ట్రంప్ ఇంత ఆగ్రహంగా ఉండటానికి మూడు ముఖ్య కారణాలున్నాయి. మొదటిది, పాకిస్థాన్‌తో అణుయుద్ధం ముప్పును తానే ఆపానని ట్రంప్ దాదాపు 30 సార్లు చెప్పారు. కానీ, ఆ కాల్పుల విరమణలో బయటివారి మధ్యవర్తిత్వాన్ని మేం అంగీకరించబోమని భారత్ మొదటి నుంచి స్పష్టం చేస్తూ వస్తోంది. అది కేవలం భారత్, పాకిస్థాన్ డీజీఎంఓల మధ్య జరిగిన ప్రత్యక్ష చర్చల ఫలితమని చెబుతోంది. దీంతో తన పాత్రను గుర్తించలేదని ట్రంప్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు పాకిస్థాన్ ఆయన పాత్రను గుర్తించడమే కాకుండా, నోబెల్ శాంతి బహుమతికి కూడా నామినేట్ చేసింది. ఇది ట్రంప్ కోపానికి ఆజ్యం పోసింది" అని స్వరూప్ వివరించారు. ట్రంప్ అసంతృప్తికి రెండో కారణం బ్రిక్స్ కూటమి అని స్వరూప్ తెలిపారు. "బ్రిక్స్ ఒక అమెరికా వ్యతిరేక కూటమి అని, డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ట్రంప్ భావిస్తున్నారు. అందువల్ల ఆ కూటమిలో భారత్ సభ్యత్వాన్ని ఆయన వ్యతిరేకిస్తున్నారు" అని పేర్కొన్నారు. ఇక మూడో కారణంగా, వాణిజ్య చర్చల్లో భాగంగా తమ వ్యవసాయ, డెయిరీ ఉత్పత్తులకు భారత మార్కెట్‌లో మరింత ప్రాముఖ్యత కల్పించాలన్న అమెరికా డిమాండ్లకు భారత్ తలొగ్గకపోవడమేనని ఆయన అన్నారు. ఈ ఒత్తిడి వ్యూహాల్లో భాగంగానే సుంకాలను ఆయుధంగా వాడుతున్నారని విశ్లేషించారు. కెనడాలో భారత మాజీ హైకమిషనర్‌గా పనిచేసిన వికాస్ స్వరూప్, ప్రఖ్యాత 'క్యూ అండ్ ఏ' నవలా రచయితగా కూడా సుపరిచితులు. కాగా, గత జులైలో భారత వస్తువులపై 25 శాతం సుంకాలు ప్రకటించిన ట్రంప్, కొద్ది రోజులకే రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకుంటున్న చమురుపై మరో 25 శాతం సుంకం విధించి, మొత్తం భారాన్ని 50 శాతానికి పెంచిన విషయం తెలిసిందే.

## తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

**హైదరాబాద్, ఆగష్టు 14:** తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం లభించింది. ఆర్డినెన్స్ 3కి గవర్నర్ ఆమోదం లభించడంతో న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్ ద్వారా సంగారెడ్డి జిల్లాలో ఇంద్రీశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటుకు ఆమోదం లభించింది. మున్సిపల్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులకు సైతం ఓటుహక్కు కల్పించేలా తెలంగాణ మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 20కి సవరణ చేశారు.




## ప్రమాదకరస్థితికి తెలంగాణ ద్రవ్యోల్బణం: మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ :** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో ద్రవ్యోల్బణం ప్రమాదకర స్థితికి చేరుకుందన్నారు. ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో వెళ్తోందనడానికి ఇదో ప్రమాదకర సంకేతమని.. రేవంత్ ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తోందని ఆక్షేపించారు. ప్రభుత్వ తప్పిదాలే దీనికి కారణమన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు. "ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదు. ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవాలంటే ప్రజల చేతుల్లో



డబ్బు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వ మూలధన పెట్టుబడి నిరంతరం తగ్గుతోంది. మూసీ, హైడ్రా వంటి నిర్ణయాలు రియల్ ఎస్టేట్ రంగాన్ని దెబ్బతీశాయి. వేలాది మంది ఉపాధి అవకాశాలపై ఇవి ప్రతికూల ప్రభావం చూపాయి. ప్రధాన ప్రాజెక్టులు చేపట్టడం, ప్రజలకు డబ్బు అందుబాటులోకి తీసుకురాకపోవడం చేస్తే ద్రవ్యోల్బణం మరింతగా దిగజారి మాంద్యంలోకి వెళ్లే ప్రమాదముంది. సీఎం రేవంత్‌రెడ్డి మేలుకోవాలి.. ప్రతీకార రాజకీయాలు కాకుండా ప్రజల గురించి ఆలోచించాలి" అని హరీశ్‌రావు అన్నారు.




## కానిస్టేబుళ్లకు దూరవిద్య.. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, పోలీసుశాఖ మధ్య ఒప్పందం

**హైదరాబాద్ :** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, తెలంగాణ పోలీసుశాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దూరవిద్య విధానంలో కానిస్టేబుళ్లు డిగ్రీ చదివేందుకు వీలుగా యూనివర్సిటీ, పోలీసు అధికారులు ఎంఓయూ చేసుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలను డీజీపీ జితేందర్, వర్సిటీ ఉన్నతాధికారులు మార్చుకున్నారు. డిగ్రీ పూర్తికాని కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు దూరవిద్య విధానం అమలు చేయనున్నారు. కానిస్టేబుళ్లకు కోర్సు మెటీ రియల్, స్టడీ సెంటర్ యాక్సెస్ ఇస్తామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

## రాహుల్‌గాంధీ రాజీనామా చేస్తే.. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు

**: ఎంపీ రఘునందన్‌రావు : ఎంపీ రఘునందన్‌రావు**

**హైదరాబాద్ :** దేశానికి ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "బ్యాలెట్ పేపర్ కాదని ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం (రాజీవ్‌గాంధీ) ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించింది. రాయ్‌బరేలిలో రాహుల్ రాజీనామా చేయాలి. రాహుల్ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తాం. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్టు. బిహార్‌లో ఓడిపోతారు కాబట్టి ఈవీఎంలు పనిచేయడం లేదంటున్నారు. ఈవీఎంలను తెచ్చిందే రాజీవ్‌గాంధీ. రాహుల్‌గాంధీ గెలిచిన రాయ్‌బరేలిలో 2లక్షల ఓట్లు అనుమానంగా కనిపిస్తున్నాయి. అక్కడ దొంగ ఓట్లతో గెలిచారు..రాహుల్ ఎన్నికను రద్దు చేయాలని కోరబోతున్నాం. బెంగాల్‌లో డైమండ్ హార్బర్‌నియోజకవర్గంపై, యూపీలో అఖిలేష్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై మాకు అనుమానాలున్నాయి. ఓడిపోతే ఈవీఎంల మీద బురదజల్లి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారు. రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థలను కాంగ్రెస్ గౌరవించడం లేదు. ఆరోపణలు చేసే ముందు శాస్త్రీయంగా వ్యవస్థల మీద అధ్యయనం చేయాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తే కేసీఆర్ ఎట్లా ఓడిపోతారు. బంగ్లాదేశ్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో గోడ కట్టాలన్న ప్రతిపాదనను మమత బెనర్జీ తిరస్కరించారు. సరిహద్దు గోడ లేకపోవడం



వల్లే బెంగాల్ ద్వారా చొరబాటు దారులు దేశంలోకి ప్రవేశిస్తున్నారు. కేటీఆర్‌కు ఎండ దెబ్బ కొట్టి తిక్క తిక్కగా మాట్లాడుతున్నారు. కోర్టు తీర్పులు భాజపాకి ఎందుకు చెంప పెట్టు అవుతాయి. ఎమ్మెల్సీల రద్దుపై తుది తీర్పు ఉంది. తుది తీర్పు వచ్చాక చెంప దెబ్బ ఎవరికి తగులుతుందో చూద్దాం" అని రఘునందన్‌రావు అన్నారు.

## హైదరాబాద్ బేగంబజార్‌లో కుప్పకూలిన పురాతన భవనం

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ పురాతన భవనం కుప్పకూలింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకొందని, దాన్ని కూల్చేయాలని గతంలోనే జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ భవనం యజమానికి నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదు. బేగంబజార్‌లో ఇలాంటి పురాతన భవనాల్లోనే వ్యాపారులు ఇప్పటికీ దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉండటంతో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటివాటిపై బల్దియా అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి వదిలేయడమే కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



## సైబర్ నేరగాళ్ల కొత్తరకం మోసం.. బాధితుడి నుంచి రూ.5.41లక్షలు కాజేసిన నిందితులు



**హైదరాబాద్ :** సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్తరకం మోసానికి తెరలేపుతున్నారు. హైదరాబాద్ పాతబస్తీలోని చుడిబజార్‌కు చెందిన బాధితుడి నుంచి రూ.5.41లక్షలు కాజేశారు. బిర్లా పెయింట్ డిస్ట్రిబ్యూటరీ కోసం చుడిబజార్‌కు చెందిన వ్యక్తి ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశాడు. ఇది గమనించిన సైబర్‌నేరగాళ్లు.. ఓపస్ బిర్లా పెయింట్ డిస్ట్రిబ్యూటర్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఫోన్ నెంబరు, వివరాలు పేర్కొన్నారు. అందులోని ఫోన్ నెంబర్‌కు బాధితుడు ఫోన్ చేయగా.. డిస్ట్రిబ్యూటర్‌గా రిజిస్ట్రేషన్, డెలివరీ, ఇతర ఖర్చుల పేరుతో రూ.5.41లక్షలు సైబర్ నేరగాళ్ల తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అనంతరం స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

## భారీ వర్షాలు.. ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి



**: పొంగులేటి**

**హైదరాబాద్ :** వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు, సహాయక చర్యలపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలని కోరారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వివిధ జిల్లాల్లోని పరిస్థితి గురించి కలెక్టర్లను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీలో మున్సిపల్, ట్రాఫిక్ విభాగాలు, మెట్రో వాటర్ బోర్డు సమన్వయంతో పని చేయాలన్నారు.

## ఇల్లీగల్ బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ సోదాలు




**హైదరాబాద్:** ఇల్లీగల్ బెట్టింగ్ యాప్ పరిమ్యాచ్ కేసులో హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఈడీ 17 చోట్ల సోదాలు చేపట్టింది. హైదరాబాద్‌తో పాటు ముంబయి, సూరత్, దిల్లీ, నోయిడా, జైపూర్, మధురై, కాన్పూర్‌లలోను సోదాలు జరిగాయి. ఈసందర్భంగా పలు బ్యాంకు ఖాతాల్లోని రూ.110 కోట్లు ఫ్రీజ్ చేసినట్లు ఈడీ అధికారులు తెలియజేశారు. డిజిటల్ డాక్యుమెంట్లు, మ్యూల్ ఖాతాల డెబిట్, క్రెడిట్ కార్డులు, డిజిటల్ పరికరాలను సైతం స్వాధీనం చేసుకొన్నామన్నారు. ముంబయి సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో పరిమ్యాచ్ డాట్ కామ్ పై నమోదైన కేసు ఆధారంగా మరో కేసు కూడా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులు పెట్టుబడి పెట్టిన వారి నుంచి ఏడాదిలో రూ.3 వేల కోట్లు కాజేసినట్లు ఈడీ పేర్కొంది. మ్యూల్ ఖాతాల్లో నగదు ఉంచి తమిళనాడు మధురైలలో భారీగా నగదు విత్ డ్రా చేసినట్లు గుర్తించింది. హవాలా రూపంలో డబ్బును యూకేకి పంపి అక్కడ క్రిప్టో కరెన్సీగా మార్చినట్లు గుర్తించామని ఈడీ అధికారులు పేర్కొన్నారు.

## పులివెందులకు పూర్వ వైభవం వచ్చింది: బాలకృష్ణ

**అమరావతి :** పులివెందుల ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందని టీడీపీ ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ అన్నారు. గతంలో పులివెందులలో ఎన్నికలు అప్రజాస్వామ్యబద్ధంగా జరిగాయని... ఇప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగాయని చెప్పారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ ఘన విజయం సాధించిన తర్వాత మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పులివెందులకు పూర్వవైభవం వచ్చిందని బాలయ్య చెప్పారు. ప్రజలు భయం లేకుండా ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. గతంలో నామినేషన్ వేయడానికే భయపడేవారని... ఇప్పుడు మాత్రం స్వేచ్ఛగా నామినేషన్లు వేశారని చెప్పారు.



# ఐదు రేకల పూలు ఎంతందమో..!

**కాంతిమంతమైన రంగుల్లో, నక్షత్రాన్ని తలపించే ఆకృతిలో బిళ్లగన్నేరు(వింకారోజ్) మొక్క నిండుగా విరబూస్తుంది. బాల్కనీల్లో పెంచుకున్నా, పోర్టికోల్లో వేలాడదీసినా, ఇంటి ముంగిటా, కాలిబాటల పక్కన నాటినా... ఎంతందంగా ఉంటాయో! మరి వీటి సంరక్షణ ఎలానో తెలుసా?**



సులువుగా పెరిగే ఈ మొక్కకు పెద్దగా సంరక్షణ అవసరం లేదు. పూలు మాత్రం ఏడాదంతా పూస్తూనే ఉంటాయి. రెండు మూడు వర్ణాల్లోనూ కనువిందు చేస్తాయి. నిగనిగలాడే పచ్చని ఆకులు, ఐదు రేకలతో నక్షత్రాకారంలో విచ్చుకునే అందమైన పూలతో ఈ మొక్క భలేగా ఆకట్టుకుంటుంది. గులాబీ, తెలుపు, ఎరుపు, ఊదా... వంటి రంగుల్లో ఏడాది పొడవునా విరబూస్తుంది. దీన్ని సాధారణంగా అలంకరణ, ఔషధ గుణాల కోసం పెంచుతారు. ముఖ్యంగా క్యాన్సర్ చికిత్సలో వాడతారు. మధుమేహం, మలేరియా సహా అనేక వ్యాధులకు దీని సారాన్ని వాడతారు. అయితే, దీన్ని నేరుగా నోట్లో పెట్టుకుంటే విషపూరితమవ్వొచ్చు.

**ఎలా పెంచుకోవచ్చు...**

గుబురుగా, తక్కువ ఎత్తులో ఎదిగే బిళ్లగన్నేరు మొక్క... వేడివాతావరణం ఉండే ప్రాంతాల్లో చక్కగా ఎదుగుతుంది. వాణిజ్య ప్రయోజనాలకోసం తగిన ఉష్ణోగ్రతలు కల్పిస్తూ, కాంతిని అందిస్తూ గ్రీన్‌హౌస్‌ల్లోనూ పెంచుతారు. తీరప్రాంత ఆవాసాల్లో, ఇసుక నేలల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది పొదలా ఉంటుంది. వీటిని విత్తనాలు, కొమ్మలతో కొత్త మొక్కలను మొలకెత్తించొచ్చు.

**కత్తిరిస్తే...పూలు**

బిళ్లగన్నేరు మొక్కను నాటే మట్టిలో సేంద్రియ ఎరువుని చేర్చితే... ఆరోగ్యంగా పెరుగుతుంది. మట్టి కనీసం అంగుళం మేర పొడారాకే నీళ్లు పోయాలి. ఎక్కువైతే వేళ్లు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. పూలు నిరంతరం పూయడానికి... నెమ్మదిగా విడుదలయ్యే ఎరువుల్ని ఇవ్వాలి. ఈ మొక్కల్ని ఎప్పటికప్పుడు కత్తిరించుకుంటే కొత్త కొమ్మలూ, పూలూ వస్తాయి. వీటికి సాధారణంగా పేనుబంక, తెల్లదోమ, బూజు తెగులు వంటివి రావొచ్చు. ఎప్పటికప్పుడు పరిశీలించి... వ్యాధిసోకిన ఆకుల్ని తీసేయాలి. గాలి ప్రసరణ ఉండేలా చూడాలి. తెగులు నివారణకు సబ్బుద్రావణాన్ని పిచికారీ చేయాలి.









# వర్షాల్లో.. కురులు పదిలమిలా...!

***ఎన్నిసార్లు శుభ్రం చేసుకున్నా ముఖం జిడ్డుగా మారడం, ఎంత దువ్వుకున్నా జుట్టు పిచ్చుక గూడులా తయారవడం.. వర్షా కాలంలో తలెత్తే సమస్యలివి! ఇలాంటి వాతావరణాన్ని ఎదుర్కొని అందాన్ని సంరక్షించుకోవడమంటే సవాలనే చెప్పాలి. ముఖ్యంగా కుదుళ్లు జిడ్డుగా మారడం, జుట్టు రాలడం, గడ్డిలా తయారవడం.. వంటి కేశ సంబంధిత సమస్యలు ఈ కాలంలో ఎక్కువగా ఎదురవుతుంటాయి. అయితే జుట్టు ఆరోగ్యాన్ని సంరక్షించుకునే క్రమంలో కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సీజన్లోనూ కేశాలను పట్టులా మెరిపించచ్చని చెబుతున్నారు సౌందర్య నిపుణులు. మరి, ఆ చిట్కాలేంటో తెలుసుకుందాం రండి!***

**వానలో తడిశారా?**

వానలో తడిసిన తర్వాత జుట్టును అలాగే ఆరబెట్టుకోవడం మనలో చాలామందికి అలవాటు. కానీ అలా చేయకుండా చల్లటి నీటితో ఓసారి తలస్నానం చేసి జుట్టు ఆరబెట్టుకోమంటున్నారు నిపుణులు. ఎందుకంటే సాధారణంగానే వర్షపు నీటిలో కొన్ని ఆమ్ల గుణాలుంటాయట! అసలే ఈ కాలంలో హ్యుమిడిటీ వల్ల కుదుళ్లు జిడ్డుగా మారి వివిధ రకాల ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి. వీటికి ఈ ఆమ్ల గుణాలు తోడవడం వల్ల సమస్య మరింత పెరుగుతుందని, అందుకే వర్షంలో తడిసినట్లయితే శుభ్రంగా తలస్నానం చేసి జుట్టును పొడిగా ఆరబెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా వర్షంలో తడిసినా జుట్టు ఆరోగ్యం దెబ్బతినకుండా జాగ్రత్తపడచ్చు.



**జిడ్డుగా మారకుండా..**

వర్షాకాలంలో నూనెకు బదులు నీటి ఆధారిత సీరమ్స్ వాడచ్చంటున్నారు నిపుణులు. తద్వారా జుట్టు జిడ్డుగా మారకుండా జాగ్రత్తపడచ్చు.. అయితే నూనె పెట్టుకోవాలనుకునే వారు.. రాత్రి పడుకునే ముందు కుదుళ్లు, జుట్టుకు నూనె పట్టించి.. ఉదయాన్నే గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి.



**ఇలాంటప్పుడు..**

కొంతమంది జుట్టు ఎంత దువ్వినా కాసేపటికే చెదిరిపోతుంది. దీంతో పదే పదే దువ్వుకోవడం, ఎక్కడికక్కడ హెయిర్ పిన్స్/క్లిప్స్ పెట్టేయడం.. వంటివి చేస్తుంటారు. నిజానికి దీనివల్ల జుట్టు చెదిరిపోకుండా ఉండడమేమో గానీ.. పిన్స్ తీసేశాక మరింత గడ్డిలాగా మారుతుంది. అందుకే అలాంటి వారు జడ/హెయిర్‌స్టైల్ వేసుకోవడానికి ముందు కాస్త హెయిర్ సీరమ్‌ని అప్లై చేసుకుంటే ఫలితం ఉంటుందట! అంతేకాదు.. ఈ కాలంలో జుట్టు, కుదుళ్లలో ఉన్న తేమ, జిడ్డును తొలగించి.. జుట్టును మృదువుగా మార్చడంలోనూ ఇది సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు.

**తలస్నానం**

కుదుళ్లు జిడ్డుగా అనిపించినప్పుడల్లా షాంపూతో తలస్నానం చేయడం మనకు అలవాటే! అయితే హ్యుమిడిటీ కారణంగా ఈ సమస్య పెరగడంతో తరచుగా తలస్నానం చేస్తుంటారు కొంతమంది. అయితే ఇలా పదే పదే షాంపూ చేసుకోవడం వల్ల జుట్టు సహజ తేమను కోల్పోతుంది. ఇది వెంట్రుకలు ఎక్కువగా రాలడానికి దారితీస్తుంది. కాబట్టి ఇలాంటి వాతావరణంలో ప్రతిసారీ షాంపూతో కాకుండా చల్లటి నీటితో జుట్టును శుభ్రం చేసుకుంటే సరిపోతుందంటున్నారు నిపుణులు. వీటితో పాటు తలస్నానం చేశాక మృదువైన క్లాత్‌తో జుట్టును తుడుచుకోవడం, జుట్టు ఆరోగ్యం కోసం నిపుణుల సలహా మేరకు నాణ్యమైన హెయిర్ స్ప్రే వాడడం, కండిషనర్ పెట్టుకున్నాక చల్లటి నీళ్లతో జుట్టును శుభ్రం చేసుకోవడం.. వంటి చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే హ్యుమిడిటీని తట్టుకొని జుట్టును ఆరోగ్యంగా మెరిపించుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

# ఆనందం... మెరిపిస్తుంది..!

**అందమైన మెరిసే చర్మం కోసం ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తుంటాం కదా! ఆ చెక్‌లిస్ట్‌లో ఆనందం ఉందా? చర్మ ఆరోగ్యంపై దాని ప్రభావమూ ఎక్కువే అంటున్నారు నిపుణులు.**

పాత ఫొటోలను తిరిగేయండి. చాలా ఆనందంగా ఉన్నవాటిని గమనించారా? దుస్తులు, మేకప్‌తో సంబంధం లేకుండా అందంగా కనిపిస్తారు. ఆ మాయ ఆనందానిదే అంటారు స్కిన్ స్పెషలిస్టులు. మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు సెరటోనిన్, ఆక్సిటోసిన్ వంటి హ్యాపీ హార్మోన్లు విడుదలవుతాయి. వీటిలో ఆక్సిటోసిన్ చర్మంపై చూపే సానుకూల ప్రభావం చాలానే. ఇది ఒత్తిడి, ఆందోళనలను దూరం చేసి, చర్మం మెరవడంలోనూ సాయపడుతుందట. అదే ఇందుకు భిన్నంగా ఒత్తిడితో సతమవుతున్నారనుకోండి. ఈ హ్యాపీ హార్మోన్లు తగ్గి, ఒత్తిడి కలిగించే కార్టిసాల్ విడుదలవుతుంది. దీంతో మొటిమలు, ఎగ్జిమా... అంటూ బోలెడు సమస్యలు. ఇంతకీ రిలేషన్‌షిప్‌లో ఉన్నారా? ఇది చేసే మాయా తక్కువ కాదు. ఎరుపెక్కిన అమ్మాయి బుగ్గలు అని చాలాసార్లే వింటాం. నచ్చినవాళ్లు పక్కన ఉన్నప్పుడు, బాగా ఆనందంగా ఉన్నప్పుడు బుగ్గల్లో రక్త ప్రసరణ పెరుగుతుంది ఆ మాయే ఇలా కెంపు రంగు అద్దుకుంటుంది. పెళ్లి, ప్రేమ... తొలిరోజుల్లో కొత్త అనుభూతులను పంచడమే కాదు, కాస్త ఒత్తిడికీ గురిచేస్తుంది కదూ! అవునుమరి... నచ్చేలా కనిపించడానికీ, మెప్పించడానికీ ఎన్నెన్ని తిప్పలు పడాలో. ఆ ప్రభావమూ యాక్నే రూపంలో ముఖాన్ని పలకరిస్తుంది. కంగారొద్దు లెండి... కాస్త ఒకరికొకరు అర్థమై సాన్నిహిత్యం పెరిగాక ఇవన్నీ దూరమవుతాయి. అబ్బాయి, అమ్మాయి మధ్య ప్రేమే కాదు... కుటుంబ సభ్యుల ఆత్మీయత కూడా చర్మంపై ప్రభావం చూపగలదు. అందుకే చుట్టూ ఆనందకర వాతావరణం ఉండాలంటారు.



# పరదా సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది

నటి అనుపమ పరమేశ్వరన్ విశ్వాసం



టాకీస్: 'పరదా' సినిమాతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటి అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధానపాత్రలో ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 22న విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ అనుపమ తన కెరీర్‌కు సంబంధించిన విషయాలను పంచుకుంటున్నారు. తాజాగా ఆమె మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఇప్పుడు తాను ఎంతో మారినట్లు- చెప్పారు. ఇండస్ట్రీలో కొనసాగడం చాలా కష్టం. ఒక్కోసారి హీరోయిన్స్ అడిగే చిన్న చిన్న విషయాలను కూడా చిత్రబృందం సీరియస్‌గా తీసుకుంటుంది. గతంలో ఇలాంటి సంఘటనలు చాలా ఎదుర్కొన్నాను. వాళ్లకు నచ్చని విషయాలు చెబితే వెంటనే పొగరు అని అంటారు. చిత్రీకరణ అనుకున్న సమయానికి ఎందుకు ప్రారంభించలేదని అడిగితే యాటిట్యూడ్ ఉ ందని అంటారు. గతంలో ఇలాంటివి నేను ఎన్నో చూశాను. ఉదయం 7 గంటలకల్లా రెడీ అయితే.. 9.30 వరకు చిత్రీకరణ ప్రారంభించరు. కో స్టార్స్ ఆలస్యంగా వస్తారని తెలిసినా.. నేను మాత్రం ఏడు గంటలకల్లా సిద్ధంగా ఉండాలి. వాళ్ల కోసం గంటన్నర ఎదురుచూడాలి. ఇదే విషయాన్ని టీ-మ్‌ను అడిగితే పొగరు ఎక్కువైంది అని అంటారు. అలా ఎవరైనా అంటే ఒకప్పుడు బాధపడేదాన్ని.. ఇప్పుడు పట్టించుకోవడం మానేశాను అన్నారు. ఆ గంటన్నరలో సినిమాకు సంబంధించిన ఎన్నో విషయాలు చర్చించుకోవచ్చు. ఇదే విషయం దర్శకనిర్మాతలతో చెబితే 'నా డబ్బులు కదా నీకెందుకు' అంటారు. ఒకవేళ ఇదే విషయం హీరోలు చెబితే వాళ్లకు ఇలాంటి సమాధానం చెప్పరు. ఇండస్ట్రీలో మాత్రమే కాదు.. బయట కూడా ఇదే పరిస్థితి ఉంది. మహిళలను ఇలానే చూస్తారని అనుపమ పరమేశ్వరన్ తెలిపారు. 'పరదా' కచ్చితంగా హిట్ కావాలని తాను కోరుకుంటు-న్నట్లు- చెప్పారు. కమర్షియల్‌గా హిట్ అయితేనే భవిష్యత్తులో ఇలాంటి చిత్రాలు మరిన్ని వస్తాయని అన్నారు.

# తనస్టైల్‌తో అదరగొట్టిన కూలీ...

విలనిజం పండించిన అక్కినేని నాగార్జున

కథ కన్నా..కథనంతో సాగించిన తీరు అద్భుతం



**టాకీస్:** రజనీకాంత్ సినిమా అంటే హైప్ సర్వసాధారణం. దానికి తోడు 'కూలీ' సినిమాలో విలన్‌గా చేసింది నాగార్జున. వీరిద్దరితోపాటు అమీర్‌ఖాన్, ఉపేంద్ర స్పెషల్ ఎట్రాక్షన్. ఇక తలైవా సినిమా అంటే అనిరుథ్ మ్యూజిక్‌లో ఏ రేంజ్‌లో రెచ్చిపోతాడో తెలిసిందే. ముఖ్యంగా బ్లాక్‌బస్టర్స్ ఖైదీ, విక్రమ్, లియోల తర్వాత లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో వచ్చిన సినిమా. అన్నింటినీ మించి రజనీకాంత్‌ని లోకేష్ కనకరాజ్ డైరెక్ట్ చేసిన తొలి సినిమా. ఈ కారణాలు చాలు... 'కూలీ'పై అంచనాలు పెరగడానికి. ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'కూలీ' గురువారం థియేటర్లలోకి అడుగుపెట్టాడు. రజనీకనపిస్తే చాలు...కథ ఎలా ఉన్నా అభిమానులు సినిమా చూస్తారు. సైమన్(అక్కినేని నాగార్జు) పేరు మోసిన స్మగ్లర్. విశాఖ షిప్‌యార్డ్‌ని అడ్డాగా చేసుకొని తన కార్యకలాపాలు కొనసాగిస్తుంటాడు. స్మగ్లగూడ్స్, బంగారం ఇల్లీగల్‌గా ఎగుమతీ, దిగుమతులు అతని వృత్తి. అతని అనుంగు అనుచరుడు దయాళ్(సౌబిన్ షాహిర్). సైమన్ ఇల్లీగల్ యాక్టివిటీస్ అన్నీ ఇతని కనుసన్నల్లోనే జరుగుతుంటాయి. మహాక్రూరుడు. ఇదిలా వుంటే.. మరణించిన జంతువుల క్రిమేషన్ కోసం రాజశేఖర్(సత్యరాజ్) ఓ ఎలక్ట్రిక్ ఛైర్‌ని తయారు చేస్తాడు. ఇలాంటి ఛైర్ కారణంగా మంచి తోపాటు- చెడు కూడా జరిగే అవకాశం ఉ ందంటూ ప్రభుత్వ ప్రతినిధులు అభిప్రాయ పడతారు. దాంతో ఆ ఛైర్‌ని మార్కెట్‌లోకి తెచ్చేందుకు గవర్నమెంట్ పర్మిషన్ ఇవ్వదు. తన శ్రమంతా వృధా అయిపోతుందనుకొని రాజశేఖర్ బాధపడుతున్న సమయంలో అతనికి సైమన్ నుంచి కబురు వస్తుంది. తాను చంపిన శవాలను బూడిద చేసేందుకు ఆ ఛైర్ కావాలంటాడు సైమన్. సహకరించపోతే కూతుళ్లను చంపుతానని బెదిరిస్తాడు. దాంతో కుటుంబం కోసం తప్పక సైమన్‌తో చేయి కలుపుతాడు రాజశేఖర్. సైమన్ చంపిన శవాలను ఆ కుర్చీ సహాయంతో బూడిద చేస్తుంటాడు. తన కుమార్తె ప్రీతి(శ్రుతిహాసన్) రాజశేఖర్‌కు ఈ విషయంలో సహాయం చేస్తుంటుంది. ఇదిలావుంటే.. ఉన్నట్టుండి రాజశేఖర్ మరణిస్తాడు. ఆ మరణవార్త విన్న రాజశేఖర్ ప్రాణస్నేహితుడు దేవా(రజనీకాంత్) షాక్ అవుతాడు. రాజశేఖర్‌ది సహజ మరణం కాదని, అతన్ని కొట్టి చంపారని దేవాకు తెలుస్తుంది. అంతేకాక, రాజశేఖర్ కుమార్తెలు ముగ్గురూ కూడా ప్రమాదంలో ఉన్నారని దేవాకు తెలుస్తుంది. దాంతో తన స్నేహితుడి పిల్లలకు దేవా అండగా నిలుస్తాడు. అసలు రాజశేఖర్‌ని చంపిందెవరు? రాజశేఖర్ పిల్లల్ని దేవా ఎలా కాపాడాడు? అసలు ఈ దేవా ఎవరు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే మిగతా కథ. ఒక సాధారణ కథా వస్తువుకు, చక్కని కథనాన్ని జోడించి, జనరంజకంగా చెప్పడానికి ప్రయత్నించాడు దర్శకుడు లోకేష్ కనకరాజ్. ప్రథమార్ధం ఆడియన్స్ ముందు కొన్ని ప్రశ్నలుంచి, ద్వితీయార్ధంలో ఆ చిక్కుముళ్లను ఒక్కొక్కటిగా విప్పుకుంటూ సినిమాను ముగించాడు. రజనీకాంత్ క్యారెక్టరైజేషన్ నెక్ట్సలెవల్లో డిజైన్ చేశారు లోకేష్. తనది కాని సమస్యలోకి ఎంటరై, ప్రమాదాలతో ఆడుకుంటూ.. రాజశేఖర్(సత్యరాజ్) కుమార్తెలను కాపాడుకుంటూ వెళ్తున్న దేవాను మనం ఫస్టాఫ్‌లో చూస్తాం. సెంకాడాఫ్‌కు వచ్చే సరికి అసలది తన సమస్యే అని తెలుస్తుంది. అదేంటనేది ఈ కథలో కీ పాయింట్. అయితే.. సినిమాలోని కొన్ని సన్నివేశాలు కృతకంగా అనిపించినా...మొత్తం సినిమా అయితే ఆకట్టుకునేలాగే ఉంది. దేవాగా రజనీకాంత్ నటనకు అభిమానులు ఉర్రూతలూగిపోవడం ఖాయం. పవర్‌ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో మరోవైపు ఎమోషన్స్‌తో అదరగొట్టేశారు సూపర్‌స్టార్. ముఖ్యంగా ఫ్లాష్‌బ్యాక్ యాక్షన్ సీక్వెన్స్‌లో వింటేజ్ తలైవాను చూసి తమిళ జనం ఊగిపోవడం ఖాయం. ఇక విలన్ సైమన్‌గా నాగార్జున ఆకట్టుకున్నారు. అందరికీ తెలిసిన ఈ పాయింట్‌కు బలమైన పాత్రలను జోడించి.. కథను మలుపులు తిప్పి.. సాంకేతిక హంగులు జోడించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన దేవా ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌ను సింపుల్‌గా మాటలతో సరిపెట్టేయడం నిరుత్సాహపరుస్తుంది. ఇక సైమన్ (కశగశసిషశ) పాత్రను ముగించిన తీరు.. చాలా సింపుల్‌గా తేల్చిపారేశారు. పతాక ఘట్టాల్లో దాహాగా ఆమిర్ పాత్రను పరిచయం చేసిన తీరు ఆకట్టుకున్నా.. 'విక్రమ్'లో రోలెక్స్ పాత్రతో పోల్చి చూసినప్పుడు ఆ స్థాయి ఎలివేషన్‌ను తాకలేకపోయింది.

# మహేష్-రాజమౌళి సినిమాలో సరికొత్త టెక్నాలజీ?




**టాకీస్:** దిగ్గజ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఎస్ఎస్ఎంబీ29 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మహేశ్ - రాజమౌళి కాంబోలో ఫస్ట్ మూవీ కావడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ని ఈ ఏడాది నవంబర్‌లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. గ్లోబ్ ట్రాటర్‌ని పరిచయం చేయబోతున్నట్లు తెలిపింది. అయితే ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి ఒక సాలిడ్ వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది.

ఈ సినిమాలో రాజమౌళి బ్లూ-స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొదట ఈ సినిమా షూటింగ్‌ను కెన్యాలోని నేషనల్ పార్క్‌లలో చేయాలని చిత్రబృందం ప్లాన్ చేసుకున్న విషయం తెలిసిందే. ఇందుకోసం రాజమౌళి కూడా అక్కడి లోకేషన్‌లను జల్లెడ పట్టి వచ్చాడు. అయితే ప్రస్తుతం కెన్యాలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ ప్లాన్ మారినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం, రాజమౌళి కెన్యాకు బదులుగా టాంజానియాలోని సెరెంగెటి అడవుల్లో షూటింగ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఈ చిత్రంలో బ్లూ-స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఆఫ్రికా అడవులను గ్రాఫిక్స్ ద్వారా రూపొందించబోతున్నట్లు సమాచారం.

# శ్రీవారి సేవలో పరమ్ సుందరి జంట



**టాకీస్:** కలియుగ దైవం తిరుమల శ్రీవారిని బాలీవుడ్ సినీ నటీనటులు జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా దర్శించుకున్నారు. గురువారం ఉదయం తిరుమలకి చేరుకున్న వీరిద్దరూ నైవేద్య విరామ సమయంలో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందించి, పట్టు- వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్ర ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'పరమ్ సుందరి'. ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటు-ంది చిత్రయూనిట్. ఈ సినిమా హిట్టు- అవ్వాలని కోరుకుంటూ ఈ జంట తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిద్దరూ కలిసి తిరుమల దర్శనం చేసుకున్న ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఇద్దరు హీరోల చిత్రం వార్-2

హృత్రిక్‌తో పోటీపడి నటించిన ఎన్టీఆర్

**టాకీస్:** ఈ ఏడాది ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న భారతీయ సినిమాల్లో 'వార్ 2' ఒకటి. హృత్రిక్ రోషన్ సినిమా అయినా, ఎన్టీఆర్ ఉండడంతో కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్; స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన ఈ ఫ్రాంఛైజీలోకి ఎన్టీఆర్; రావడంతో తెలుగు వారికి మరింత ప్రత్యేకంగా మారింది. అత్యంత భారీ చిత్రం 'బ్రహ్మాస్త్ర తర్వాత అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ అద్భుతమనే చెప్పాలి. మాజీ ఏజెంట్ కబీర్ (హృతిక్ రోషన్) దేశం దృష్టిలో ఓ ద్రోహి. రా విభాగానికి చీఫ్ అయిన కల్నల్ సునీల్ లూథ్రా (అశు తోష్ రాణా)కి ఒకప్పుడు నమ్మిన బంటు-. అలాంటి కబీర్ రా కళ్లుగప్పి అజ్ఞాతంలో గడుపుతుంటాడు. ఓ కాంట్రాక్ట్‌లో భాగంగా జపాన్‌లో అత్యంత శక్తిమంతమైన ఓ వ్యక్తిని అంతం చేస్తాడు. ఆ తర్వాత అతనిపై కలి కార్టెల్ అనే ఓ అజ్ఞాతమైన అసాంఘిక శక్తి కన్నేస్తుంది. కబీర్‌ని తన కార్టెల్‌లో భాగం చేసుకుని భారతదేశాన్ని గుప్పెట్లోకి తీసుకోవాలనేది కలి పన్నాగం. ఆ కార్టెల్ మొదట కబీర్‌కి ఓ టాస్క్ అప్పజెబుతుంది. తనకి గాడ్ ఫాదర్ లాంటి సునీల్ లూథ్రాని అంతం చేయాలనేదే ఆ టాస్క్. చెప్పినట్టే ఆ పనిని పూర్తి చేస్తాడు కబీర్. దాంతో కబీర్‌ని ఎలాగైనా పట్టుకోవాలని రా కొత్త చీఫ్ విక్రాంత్ కౌల్ (అనిల్ కపూర్), భారత ప్రభుత్వం సోల్జర్ విక్రమ్ చలపతి (ఎన్టీఆర్) నేతృత్వంలో ఓ బృందాన్ని రంగంలోకి దింపుతుంది. ఆ బృందంలో లూథ్రా కూతురు వింగ్ కమాండర్ కావ్య లూథ్రా (కియారా అద్వాణీ) కూడా ఒకరు. మరి కబీర్ కోసం విక్రమ్ బృందం మొదలుపెట్టిన వేట ఎలా సాగింది? కబీర్ దేశద్రోహిగా ఎందుకు మారాడు? అతనికీ, కావ్యకీ ఉన్న సంబంధం ఏమిటి? కబీర్... లూథ్రాని చంపడం వెనక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? కబీర్‌కి విక్రమ్ ఎవరో తెలిశాక ఏం చేశాడు? కలి కార్టెల్ వెనకున్న అజ్ఞాత శక్తులు ఎవరు? తదితర విషయాలు ఆసక్తికరంగా మలిచారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచీ ఈ కథలో హీరో ఎవరు? విలన్ ఎవరనే ప్రశ్నే ఎక్కువగా అభిమానుల నుంచి వ్యక్తమైంది. అయితే ఇది హీరో విలన్ల కథ కాదు, ఇద్దరు హీరోల కథ అని ఆరంభ సన్నివేశాలతోనే చెబుతూ సినిమాని మొదలుపెట్టాడు దర్శకుడు. ఇద్దరు హీరోల పరిచయ సన్నివేశాలు విజిల్స్ కొట్టిస్తాయి. జపాన్‌లో హృతిక్ ఫైట్, నౌకలో ఎన్టీఆర్ యాక్షన్ ప్రథమార్ధంలో కీలకం. కబీర్ కోసం సోల్జర్ విక్రమ్ వేట మొదలు పెట్టినప్పటి నుంచి అసలు సిసలు వార్ మొదలవుతుంది. వారిద్దరూ ఒకరికొకరు ఎదురుపడటం, ఆ నేపథ్యంలో యాక్షన్ సన్నివేశాలు థ్రిల్‌ని పంచుతాయి. ముఖ్యంగా స్పెయిన్‌లో సాగే ఛేజింగ్, విరామానికి ముందు ఆకాశంలో విన్యాసాలు కట్టిపడేస్తాయి. విరామానికి ముందు సన్నివేశాల్లో మలుపు ద్వితీయార్ధంపై ఆసక్తిని రేకెత్తిస్తాయి. ప్రథమార్ధంలో యాక్షన్ హంగామానే ఎక్కువగా అనిపించినా, ద్వితీయార్ధంలో కథలో భావోద్వేగ కోణాన్నీ ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. విక్రమ్‌కీ, కార్టెల్‌కీ మధ్య సన్నివేశాలు ద్వితీయార్ధానికి హైలైట్. ఇవన్నీ ఒకెత్తయితే, పతాక సన్నివేశాలు మరో ఎత్తు. రా విభాగం దావోస్‌లో ఒక పక్క ప్రధానిని రక్షించడం, మరోవైపు విక్రమ్, కబీర్ కలిసి చేసే అంతిమ పోరాటం ప్రేక్షకుడిని లీనం చేస్తాయి. పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలూ ఆకట్టుకుంటాయి. కథని ముగించిన తీరు కూడా మెప్పిస్తుంది. కబీర్ పాత్రలో హృతిక్ కనిపించడం కొత్త కాదు. 'వార్'కి కొనసాగింపుగా, ఆ పాత్రని అంతే సమర్థంగా ఇందులో పోషించాడు. యాక్షన్ హీరోగా ఆయన ÷-టసైల్, ఎన్టీఆర్‌తో కలిసి చేసిన పోరాటాలు, సలామ్ అనాలి పాటలో డ్యాన్స్‌లు ఆకట్టుకుంటాయి. ఎన్టీఆర్ యాక్షన్ అవతారం ఈ సినిమాకి మరొక ప్రధాన ఆకర్షణ. ఇందులోని విక్రమ్ పాత్రలో ఒదిగిపోయారు. కియారా అద్వాణీ ఊపిరి ఊయలగా పాటలో తన అందంతో కట్టిపడేస్తుంది. అశుతోష్ రాణా, అనిల్ కపూర్, వరుణ్ బదోలా పాత్రలూ మెప్పిస్తాయి. సినిమా మొత్తం ప్రధానంగా హృతిక్, ఎన్టీఆర్ చుట్టూనే సాగుతుంది. దాంతో మిగిలిన పాత్రలకి పెద్దగా ప్రాధాన్యం దక్కలేదు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.